


సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

20 YEARS ANNIVERSARY

https://www.satyamdaily.net/

శనివారం 7-6-2025

సంపుటి: 21 సంచిక: 64
పేజీలు: 8 వెల: రూ.1

## తరలుతున్న ఇసుక రాశులు..

# నేతలకు కాసులు!



గారలో ఇసుక తవ్వడానికి నదిలో వేసిన ర్యాంప్

- అనుమతులు ముగిసినా ఆగని తవ్వకాలు
- విశ్వసముద్ర పేరుతో అనేక చోట్ల దందా
- పక్క జిల్లాల నుంచి వచ్చిన బడాబాబులదే హవా
- నాయకుల పేరు చెప్పి వ్యాపారం చేసుకుంటున్న తమ్ముళ్లు
- చేతులు ముడుచుకున్న అధికార గణం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

గోదావరి జిల్లాల కంటే శ్రీకాకుళంలోనే ఇసుక లభ్యత ఎక్కువ. దీనికి తోడు విజయనగరం, విశాఖపట్నం నదుల్లో ఉన్న ఇసుక నిర్మాణాలకు పనికి రాదు. దీనివల్ల ఎక్కడి నుంచో దిగుమతి అయిన పెట్టుబడిదారులు స్థానిక నాయకులకు ఒక ర్యాంపునకు రూ.50 లక్షల వరకు ముట్టజెప్పి, అంతకు పదింతలు తవ్వుకుపోతున్నారు. ఇసుక అక్రమంగా తరలిపోతుందని పైడిభీమవరం వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేస్తే కొన్నాళ్లు ఈ దందా ఆగింది. శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలన్నట్టు ఒక నకిలీ యాప్‌ను తయారుచేసి గవర్నమెంట్ బిల్లుకు బాబులాంటిదొకటి తయారుచేసి నకిలీబిల్లును చూపిస్తూ జిల్లా బోర్డర్ దాటేస్తున్నారు. ప్రస్తుతం రెండు నెలల పాటు జిల్లాలో ఉన్న నాగావళి, - మిగతా చివరి పేజీలో


జిల్లాలో ఇసుక తవ్వకాల కోసం అధికారికంగా టెండరు దక్కించుకున్న ర్యాంపులన్నింటిలోనూ పరిమితి మేరకు తవ్వకాలు పూర్తయిపోయాయి. దీంతో గతంలో ఇచ్చిన ఎన్విరాన్‌మెంటల్ క్లియరెన్స్‌లు, మైనింగ్ అనుమతులు ఆటోమేటిగ్ రద్దయిపోయినట్టే. మళ్లీ కొత్త టెండర్లు పిలవాలంటే ప్రతీ ర్యాంపులోను అన్ని అనుమతులు తెచ్చుకోవాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ ఇప్పటికీ ఇసుక తవ్వకాలు ఆగడంలేదు. పోలీస్, రెవెన్యూ, మైనింగ్ శాఖలేవీ కళ్ల ముందే ఇసుక లారీలు తరలిపోతున్నా నీ బిల్ ఎక్కడ? ఇసుక ఎక్కడికి పట్టుకెళ్తున్నావ్? అని అడగలేకపోతున్నారంటే కారణం.. ప్రతీ రీచ్ వెనుక స్థానిక ఎమ్మెల్యే హస్తం ఉంది. అయితే ఇది ఎంతవరకు అన్నదే ప్రశ్న. ఎందుకంటే.. ఇప్పుడు అమలవుతున్న ఉచిత ఇసుక విధానమైనా, గత ప్రభుత్వం చేపట్టిన జేపీ వెంచర్స్ తవ్వకాలైనా ఏమేరకు అనుమతులు ఇచ్చారు, ఏమేరకు తవ్వుకుపోయారన్నదానిపైనే చర్చ. ఎందుకంటే.. ప్రతీ నెల 12వేల మెట్రిక్ టన్నుల ఇసుకను ఒక ర్యాంపు నుంచి తరలించుకుపోతున్నారు. ఆ ర్యాంపునకు ఎన్ని హెక్టార్ల తవ్వకాలకు అనుమతులిచ్చారు, అందులో ఇసుక లభ్యత ఎంత? అన్న విషయాలు పక్కన పెట్టి 10 నుంచి 12వేల మెట్రిక్ టన్నుల మేరకు ఇసుకను తవ్వుకుపోతున్నారు. కానీ ప్రభుత్వ ఖజానాకు జమైన లెక్కలు చూస్తే 500 మెట్రిక్ టన్నులు మాత్రమే డబ్బులు సంబంధిత ర్యాంప్‌కు జమవుతుంది. అంటే ఈమేరకు మాత్రమే ఆన్‌లైన్‌లో బిల్లులు తీస్తున్నారు. మిగిలినదంతా అనధికారికంగా తవ్వుకుపోతున్నదే.



పాతపట్నం నియోజకవర్గంలో ఒక ర్యాంప్ నుంచి ఇసుకను తరలిస్తున్న దృశ్యం

భైరి తోటల్లో దాచిన ఇసుక

- మహానగరం అనేది ప్రభుత్వం నిర్మించేది కాదు. అది కాలక్రమేణా జనమంతా చేరి అంచెలంచెలుగా కొంచెం కొంచెంగా కాలానుగతంగా నిర్మించుకునే ప్రాంతం. ప్రభుత్వం దగ్గర ఉండే కొద్దిపాటి నిధులు దైనందిన కార్యక్రమాలను దాటి నగర నిర్మాణాలకు సరిపోవు.
- తిరిగి చంద్రబాబు పాలనకు వచ్చారు. ఇప్పుడు మళ్లీ పాత అమరావతిని పట్టాలపైన పెట్టడమే కాకుండా కొత్తగా మరొక 50వేల ఎకరాలు తీసుకుని ఎన్నెన్నో ఇతర కార్యక్రమాలు చేపట్టాలని చూస్తున్నారు. కాకపోతే మన బడ్జెట్, మన తాహతు దానికి సరిపోవు. 13 జిల్లాల చిన్న రాష్ట్రానికి రాత్రికి రాత్రి ప్రపంచ స్థాయి రాజధాని రాదు.
- హైదరాబాదు హైటెక్ మోడల్ ఇక్కడ అమలవుతుందనుకుంటే అంతకంటే హాస్యాస్పదమైన ఆలోచన మరొకటి ఉండదు.



# బాబుగారికి అలా కలిసొస్తుంది!

పెపకాయల రామకృష్ణ




కొన్ని కొన్ని విషయాల్లో నిజం పాలు ఎలా ఉన్నప్పటికీ.. అవి సాధారణ ప్రజలు ప్రశ్నించడానికి అతీతంగా ఉంటాయి. విజనరీ అనే పదం చంద్రబాబుకు అతుక్కుపోయింది. అంతేకాకుండా ఐటీ అంటే.. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ. ఇది కూడా ఆయనకే దఖలు పడిపోయింది. 1995లో ఏ పరిస్థితుల్లోనైతేనేమీ ఆయన ముఖ్యమంత్రి అయ్యే సమయానికి కంప్యూటర్ విప్లవం ఒక రకమైన విస్ఫోటనం చెందింది. మన దేశంలో అప్పటికే బెంగళూరు ఆ దిశలో ముందంజలో ఉండగా, హైదరాబాదులో హైటెక్ సిటీని అంతకు ముందు కాంగ్రెస్ ముఖ్యమంత్రి జనార్ధన్‌రెడ్డి హయాంలో పునాదిరాయి వేసి శ్రీకారం చుట్టాకా ప్రభుత్వాలు మార్పిడిలో ఈయన సమయానికి అది రావడం, ఆ తర్వాత ఈయన చక్రం తిప్పే కాలంలో హైటెక్ సిటీ డెవలప్ కావడం.. వగైరా పనులన్నీ జరిగి జనమంతా చంద్రబాబు కంప్యూటర్‌ని కనిపెట్టి జనానికి అంతర్జాలాన్ని పరిచయం చేసారని నమ్మే పరిస్థితికి వచ్చారు.

అంతేకాకుండా ఆ తర్వాత వచ్చిన మొబైల్ ఫోన్ల విప్లవం కూడా చూశాక మొబైల్ ఫోన్ కూడా చంద్రబాబే కనిపెట్టి జనానికి ఇచ్చారని ఒక రకమైన బలమైన నమ్మకాన్ని జనం పెట్టేసుకున్నారు. అది కాదంటే మనల్ని కొట్టేట్టున్నారు. నిజానికి ఏదో ఒక సందర్భంలో బాబుగారే చెప్పారు.. తనకు సెల్‌ఫోన్‌లో మెసేజ్ పెట్టడం కూడా తెలియదని. ఇక్కడ రెండు రకాలు. మెసేజ్ పెట్టడానికి కావలసిన సాంకేతిక పరిజ్ఞానం ఒకటైతే, ఆ మెసేజ్ రాయడానికి కావలసిన భాషా పరిజ్ఞానం మరొకటి. ఈ రెంటిలోనూ ఆయన బలహీనుడే కాబట్టి ఒక సందర్భంలో తనే చెప్పేశారు తనకు మొబైల్ ఫోన్లో మెసేజ్ పెట్టడం కూడా తెలియదని. ఏదేమైనప్పటికీ జనం దృష్టిలో ఆయనే గ్రాహం బెల్. ఇంటర్నెట్ కనిపెట్టిన ఆయన ఎవరో నాకు తెలియక పోవడం క్షమార్హం కాకపోయినప్పటికీ క్షమించేయాలి. ఎందుకంటే అజ్ఞానాన్ని క్షమించలేకపోవటం మీ దుర్మార్గం అవుతుంది.

ఆ విధంగా కంప్యూటర్‌ని, ఇంటర్నెట్‌ను, మొబైల్ ఫోన్‌ని కనిపెట్టి జనానికి అందించారని జనమంతా ఇప్పుడు కూడా నమ్ముతున్నారు. విచిత్రం ఏమంటే పాత రోజుల్లో జేఎన్‌టీయూ లాంటి అత్యున్నత సాంకేతిక విద్యాసంస్థల్లో ఇంజనీరింగ్ చదివిన ఉన్నత విద్యావంతులకు కూడా ఈ నమ్మకం ఉంది. మనలాంటి సామాన్యులకు ఇక చెప్పేదేముంది. దాంతో ఆయన అన్నీ తానే అనే ఒక మానసిక భావనకు లోనై ఉంటాడు కాబట్టి ఆ రంగంలో ఇప్పుడు కొత్తగా వచ్చిన చాట్ జిపిటి, ఆర్టిఫిషియల్ - మిగతా చివరి పేజీలో

- ప్రజారాజధానులను ప్రభుత్వాలు కట్టలేవ్
- వెయ్యి మంది రాని ఎయిర్‌పోర్టుకు అప్పులిచ్చే సంస్థలెక్కడ?
- రాజధాని ప్రాంతంలో భూముల ధరలు నేలచూపులు
- హైదరాబాద్ హైటెక్ మోడల్ అమరావతిలో కుదరదు



రాజధాని రెండోదశకు

40-45 వేల ఎకరాల భూసమీకరణ

- 38 వేల ఎకరాలు ఇచ్చేందుకు ఇప్పటికే రైతుల అంగీకారం
- విమానాశ్రయం, స్పోర్ట్స్ సిటీ, స్మార్ట్ ఇండస్ట్రీస్ కోసమే..
- తొలి విడతలో నిబంధనలే మలి విడతకూ వర్తింపు
- మంత్రి నారాయణ వెల్లడి
- ముఖ్యమంత్రి అధ్యక్షతన సీఆర్డీయే సమావేశం




## వైభవంగా లలితాదేవి సహిత శివకామేశ్వర స్వామి కల్యాణం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మొండేటివీధిలోని శ్రీ లలితా దేవి సహిత శివకామేశ్వర స్వామి ఆలయ మూడవ వార్షికోత్సవ సందర్భంగా శ్రీ లలితాదేవి సహిత శివకామేశ్వర స్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం 6:30 గంటలకు అశేష భక్తజన సందోహం మధ్య స్వామివారి కల్యాణం జరిపారు. కార్యక్రమంలో శ్రీ షిర్డీసాయి సేవా సంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



• ఎడిటోరియల్

# ఆర్థిక వృద్ధి వేగం.. కొనుగోలు శక్తి హీనం

భారత ఆర్థిక వ్యవస్థ ఎన్నడూ లేనంత స్పీడుగా పరుగులు తీస్తోంది. అగ్రదేశాలుగా ఏళ్ల తరబడి కొనసాగుతున్న దేశాలను ఒకదాని తర్వాత మరోదాన్ని వెనక్కి నెడుతూ అగ్రపథంలోకి దూసుకుపోతోంది. నిన్నగాక మొన్నే నాలుగో స్థానంలో ఉన్న జపాన్‌ను వెనక్కి నెట్టి ఐదో స్థానం నుంచి నాలుగో స్థానానికి ఎగబాకింది. మరింత ప్రగతి సాధిస్తూ రేపో మాపో అమెరికా, చైనాల తర్వాత ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని ప్రపంచస్థాయి ఆర్థిక నివేదికలతో పాటు ఘోషిస్తున్నాయి. దాన్నే ఎన్డీయే పాలకులు ఘనంగా ప్రచారం చేసుకుంటున్నారు. కానీ వాస్తవ పరిస్థితి మరోలా ఉందని, భారత ఆర్థిక నాణేనికి మరో పార్శ్వం కూడా ఉందని ఆర్థిక నిపుణులు, కొన్ని నివేదికలు ఎత్తి చూపుతున్నాయి. మన ఆర్థిక రథం శరవేగంగా పరుగులు తీస్తున్నా దాని ఫలాలు దిగువస్థాయికి చేరడం లేదన్నదే వాటి సారాంశం. ఆర్థికంగా ఎదిగామని, మన కొనుగోలు శక్తి పెరిగిందని చెబుతున్నా.. ఇప్పటికీ సామాన్య ప్రజలు కొనుగోళ్ల విషయంలో ఒకటికి పదిసార్లు ఆలోచిస్తున్నారని, తగిన ఆర్థిక శక్తి వారికి లేకపోవడమే దీనికి కారణమని ఇండస్ వ్యాలీ యాన్యువల్ రిపోర్టు–2025 కుండ బద్దలుకొట్టింది. భారత ఆర్థిక వ్యవస్థ ప్రగతిపథంలో ఉంది. స్టార్టప్‌ల బూమ్ నడుస్తోంది. పెట్టుబడులు పెట్టేందుకు విదేశీ పెట్టుబడిదారులు ముందుకొస్తున్నారు. గత కొన్ని నెలల పరిణామాలు మినహాయిస్తే మొత్తంగా కొన్నేళ్లుగా స్టాక్ మార్కెట్లు గణనీయ వృద్ధిని నమోదు చేశాయి. అయితే ఇదంతా ఒక కోణం మాత్రమేనని వెంచర్ క్యాపిటల్ సంస్థ 'బ్లూమ్ వెంచర్స్' విడుదల చేసిన ఇండస్ వ్యాలీ రిపోర్టులో పేర్కొన్నారు. సంపద కొద్దిమంది చేతుల్లోనే పేరుకుపోవడం, సామాన్య ప్రజల కొనుగోలు శక్తిలో వృద్ధి లేకపోవడం సహా భారత ఆర్థిక రంగంలో పేరుకుపోయిన పలు వ్యవస్థాగత లోపాలను ఈ నివేదిక ప్రముఖంగా ప్రస్తావించింది. మన ఆర్థిక వ్యవస్థ ఏటా విస్తరిస్తోందనడంలో సందేహం లేదు. అయినప్పటికీ దేశంలో 90 శాతం ప్రజలు మాత్రం తమకు నచ్చింది కొనుగోలు చేసే స్థాయిలో లేకపోవడం గమనార్హం. ఏదైనా వస్తువు కొనేముందు వారు చాలా ఆలోచిస్తున్నారు. సంపదపరంగా పైస్థాయిలో ఉన్న పది శాతం మంది మాత్రమే ఖర్చుకు వెనుకాడడం లేదు. తక్కువ సంఖ్యలో ఉన్న ఈ సంపన్నవర్గాలవారే భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నారు. మధ్యతరగతి ఆదాయవర్గంలో ఉన్న మరో మూడు కోట్ల మంది ఇప్పుడిప్పుడు కొంత వరకు నచ్చింది కొనగలిగే స్థాయికి చేరుకున్నారు. మిగిలిన 60 శాతం దేశప్రజలు మాత్రమే తమకు నచ్చిన వాటిని, తమకు అవసరమైన వాటిని కొనుగోలు చేయడానికి వెనకా ముందూ ఆలోచించాల్సిన పరిస్థితి ఉంది. భారత జీడీపీలో వినియోగదారుల ఖర్చు వాటా 60 శాతం. ఆర్థిక వ్యవస్థ విషయంలో మనతో దాదాపు సమానంగా ఉన్న ఇతర దేశాలతో పోలిస్తే మన తలసరి వినిమయం మాత్రం చాలా తక్కువగా ఉంది. ఈ విషయంలో చైనా కంటే మనం ఏకంగా ఒక దశాబ్ద కాలం వెనుకబడి ఉన్నాం. సంపద కొంతమంది చేతుల్లోనే పేరుకుపోతోంది. మధ్య ఆదాయ వర్గాల్లో మాత్రం ఎలాంటి మార్పు లేదు. దీంతో కంపెనీలు సంపన్నుల కోసం ఖరీదైన, లగ్జరీ వస్తువులను మాత్రమే తయారు చేస్తున్నాయి. దీంతో ప్రీమియమైజేషన్ మార్కెట్ ఏర్పడుతోంది. మరోవైపు దేశంలో ఫ్యామిలీ సేవింగ్స్ పడిపోతుండగా.. అప్పులు పెరిగిపోతున్నాయి. చాలామంది బంగారంపై ఇన్వెస్ట్ చేయడానికే ఇష్టపడుతున్నారు. రియల్ ఎస్టేట్ జోలికి వెళ్లడానికి వెనకాడుతున్నారు. ఈ రంగంలో లిటిగేషన్లు పెరగడమే దీనికి కారణం. గోల్డ్ అయితే ఎప్పుడంటే అప్పుడు డబ్బుగా మార్చుకునే వీలుంటుందనే భావనే కారణం. నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు చాలా సులభంగా రుణాలు ఇస్తున్నాయి. దీంతో వ్యక్తిగత రుణాలు తీసుకునేవారి సంఖ్య పెరిగిపోయింది. దేశంలో స్టార్టప్ ఎకో సిస్టమ్ ఇంకా విస్తరిస్తూనే ఉంది. ఈ విషయంలో ప్రపంచంలో భారత్‌ది మూడో స్థానం. అయితే వాటి విలువను మాత్రం చాలా పెంచి చూపిస్తున్నట్లు ఇండస్ వ్యాలీ నివేదిక అంచనా వేసింది. కేవలం 90 కంపెనీల విలువ మాత్రమే ఒక బిలియన్ డాలర్లు మించి ఉంటుందని పేర్కొంది. ప్రజలందరినీ ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములను చేయడంలో యూపీఐ, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్స్ వంటి చెల్లింపు వ్యవస్థలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. ఆన్‌లైన్ లావాదేవీల్లో సుమారు 83 శాతం యూపీఐ ద్వారానే జరుగుతున్నాయి. ప్రపంచంలో అతిపెద్ద డెరివేటివ్స్ మార్కెట్‌గా భారత్ అవతరించింది. హైరిస్క్ ఆప్షన్స్ ట్రేడింగ్‌లో రిటైల్ ఇన్వెస్టర్లు పెద్ద ఎత్తున పాల్గొండటమే దీనికి కారణం. కానీ వీరిలో 91 శాతం మంది తమ సంపదను కోల్పోతున్నారు.

# మతసామరస్యానికి ప్రతీక బక్రీద్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



పండగను మతసామరస్యానికి ప్రతీకగా కుల, మతాలకు అతీతంగా సోదరభావంతో, శాంతియుతంగా నిర్వహించుకోవాలని జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి శుక్రవారం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ముస్లిం సోదరులకు బక్రీద్ (ఈదుల్ అజ్ హా) పండగ శుభాకాంక్షలు తెలిపారు. బక్రీద్ పండగ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సంబంధిత పోలీసు అధికారులు ముందస్తు భద్రత చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి ఐపిఎస్ మాట్లాడుతూ – బక్రీద్ (ఈదుల్ అజ్ హా) పండగ భక్తికి ప్రతీకని, పండగను ముస్లిం సోదరులు మతసామరస్యంను పాటిస్తూ, శాంతియుతంగా నిర్వహించుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లోని మసీదుల వద్దకు బక్రీదు పండగ సందర్భంగా ముస్లిం సోదరులు సందర్శించి, ప్రత్యేక ప్రార్థనలు చేపట్టే అవకాశం ఉన్నందున మసీదుల వద్ద ప్రశాంతంగా ప్రార్థనలు చేసుకునేల చర్యలు చేపట్టి,ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యమైన మసీదుల వద్ద డ్రోన్స్, సిసి కెమెరాలతో నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ప్రతీ పోలీసు స్టేషను పరిధిలోని మసీదులను కవర్ చేస్తూ పెట్రోలింగు నిర్వహించే విధంగా భద్రత చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు, ఇతర వాహనదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వాహనాల పార్కింగు చేసుకోవాలన్నారు. మతసామరస్యానికి ఎటువంటి విఘాతం కలగకుండా ప్రతీ ఒక్కరూ స్వీయ నియంత్రణ పాటిస్తూ, సామాజిక బాధ్యతతో వ్యవహరించాలన్నారు. ముస్లిం–హిందువుల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే సామాజిక మాధ్యమాల్లో ప్రచారమయ్యే అసత్య ప్రచారాలను నమ్మవద్దన్నారు. మతాలు, కులాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే వ్యక్తులు లేదా వస్తువులు కనబడితే సమాచారాన్ని,గోవధ, పశువుల అక్రమ రవాణా యొక్క సమాచారాన్ని డయల్ 100,112 లేదా స్థానిక పోలీసులకు అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ప్రజలకు జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి పిలుపునిచ్చారు.

# మర్యాదపూర్వకంగా వ్యవహరించాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మహిళా పోలీసు స్టేషన్‌కు సమస్యలతో వచ్చే మహిళా ఫిర్యాదుదారుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించి వారి సమస్యలపై సానుకూలంగా స్పందించి సత్వరమే న్యాయం చేకూర్చాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి మహిళా పోలీస్ స్టేషన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం జిల్లా ఎస్పీ ఆకస్మికంగా మహిళా పోలీస్ స్టేషన్ సందర్శించి స్టేషన్లో రిసెప్షన్ కేంద్రం, పలు రికార్డులు నిర్వహణ తనిఖీ చేసి,సిబ్బంది వివరాలపై ఆరా తీశారు. భార్యభర్తలు మధ్య వచ్చే చిన్నపాటి మనస్పర్థలు వలన గొడవలు పడి సంసారాన్ని నాశనం చేసుకుంటున్నారని అలాంటి వారికి పూర్తి స్థాయిలో కౌన్సిలింగ్ ఇచ్చి సంసారాన్ని చక్కదిద్దే చొరవ తీసుకోవాలని సూచించారు. పెండింగ్లో ఉన్న కేసులు, ఎన్.బి.డబ్ల్యులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. విధి నిర్వహణలో క్రమశిక్షణ పాటిస్తూ ప్రతి ఒక్కరు విధు లు నిర్వహించాలని పలు అంశాలపై జిల్లా ఎస్పి దిశ నిర్దేశాలు చేశారు. ముఖ్యంగా మహిళా ఫిర్యాదుదారుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వారి సమస్యలను సావధానంగా వినాలని సూచించారు.



# వృద్ధులకు, వికలాంగులకు ఇంటికే రేషన్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రేషన్‌షాపు డీలర్లు వృద్ధులకు, వికలాంగులకు ఇంటి వద్దకు వెళ్లి రేషన్ పంపిణీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. జూన్ నుంచి డీలర్ల వద్ద రేషన్ తెచ్చుకునే విధంగా ఆదేశాలు జారీ అయిన విషయం తెలిసిందే. ఈ పంపిణీలో భాగంగా 65 సంవత్సరంలు పైబడిన కార్డుదారులకు ఇంటి వద్దకు బియ్యము పంపిణీ చేయాలని ఆదేశించారు. కార్డుదారులు తమకు సమీపములో ఉన్న ఏ చౌకధరల దుకాణం వద్దకు అయినా వెళ్లి రేషన్ తీసుకునే అవకాశం కల్పించారన్నారు. కావున ఈ క్రింది శ్రీకాకుళం పట్టణంలో ఉన్న చౌకధరల దుకాణం ప్రస్తుతము ఉన్న స్థలము, డీలర్ ఫోన్ నెంబరులో తెలియజేశామన్నారు. 65సంవత్సరంలు పైబడిన కార్డు దారులు/వికలాంగుల/బెడ్ రెస్ట్ కార్డుదారులు తమ సమీపంలో ఉన్న చౌకధరల దుకాణం డీలర్‌కు సంప్రదించిన యెడల 65 సంవత్సరంలు పైబడిన కార్డుదారులకు ఇంటి వద్దకు బియ్యము పంపిణీ చేస్తామని తెలియజేశారు. తమకు దగ్గర ఉన్న కార్డుదారులు దుకాణం వెళ్లి నిత్యావసర సరుకులు తీసుకోగలరన్నారు. 65 సంవత్సరంలు పైబడిన కార్డు దారులు/ వికలాంగుల / బెడ్‌రెస్ట్ కార్డు దారులు తమ సమీపంలో ఉన్న దుకాణం డీలర్‌కు సంప్రదిస్తే ఇంటి వద్దకు రేషన్ అందజేస్తారన్నారు.

# అమ్మవారి సేవలో మాజీ మంత్రులు

(సత్యంన్యూస్, ఇచ్ఛాపురం)

నియోజకవర్గ పరిధి కంచిలి అమ్మవారి ఉత్సవాల్లో మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజులు పాల్గొన్నారు. వారికి ఉత్సవ కమిటీ సభ్యులు అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు కార్యక్రమంలో జడ్పీ ఛైర్ పర్సన్ పిరియావిజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, టెక్కలి, ఆమదాలవలస ఇన్‌చార్జ్‌లు పేరాడ తిలక్, చింతాడ రవి కుమార్, మాజీ ఎమ్మెల్యే నరేష్‌కుమార్ అగర్వాల్, డీసీసీబీ మాజీ ఉపాధ్యక్షులు నర్తు నరేంద్ర యాదవ్, సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్ రెడ్డి వైకాపా నియోజకవర్గ యువ జన అధ్యక్షులు నర్తు ప్రేమ్ కుమార్ యాదవ్, ఎంపీపీలు పైల దేవదాస్ రెడ్డి కడి యాల ప్రకాష్ జడ్పీటీసీలు ఇప్పిలి లోలక్షి క్రిష్ణారావు, తడక యశోద జోగారావు, పిలక దేవరాజ్, ప్రకాష్‌రావు పట్నాయక్, బచ్చు జగన్‌రెడ్డి, కొల్లి ఈశ్వ రావు, రాందాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు..



# ఘంటసాలకు నచ్చిన పొగడ్త

( మన బాలు చెప్పినది )



ఒక సారి ఘంటసాల గార్ని ఒకళ్ళు అడిగారట.. "ఏ కళాకారులైనా తమ కళని గుర్తించాలని చూస్తారు కదా.. ఒక గాయకుడిగా మీ జీవితంలో మీకు చాలా బాగా నచ్చిన పొగడ్త చెప్పండి.." అని.. అప్పుడు ఆయన (ఆ రోజుల్లో టీవిలూ అవీ లేవు కనక ఆయన రూపం జనానికి తెలిసే అవకాశం లేదు). "ఒకసారి నేను ఒక టీ కొట్టు పక్కన టీ తాగుతున్నాను. 'మహాకవి కాళిదాసు' సినిమాలోని "మాణిక్యవీణా...అని పాట రేడియోలో వస్తోంది. ఆ పాటను.. అక్కడున్న ఒక రిక్షా అతను ఎంతగానో లీనమైపోతూ గొంతుకలిపి పాడుతూ విని ఒక చోటుకొచ్చేసరికి అతను ఆగిపోయి... ఇహ పాడలేక... "అబ్బబ్బబ్బ ఏంపాడాడ్రా.. ఏం పాడాడ్రా... ఘంటసాల.!!!!.. 'నంజకొడుకు' సంపేసినాడ్రా... సంపేసినాడ్రా నంజకొడుకు నంజకొడుకు... సంపేసినాడ్రా" అంటూ అరిచేస్తూ అన్నాడట." ఆ మాటలు ఆ పక్కనే కూర్చున ఘంటసాల గారు విని నవ్వుతూ ఆయన కూడా చూశారట.

ఘంటసాల గారు ఈ మాటలు చెప్పగానే అక్కడున్న ఆయన అభిమానులు షాకైపోయి కాసేపాగి తేరుకుని చాలా ఆశ్చర్యంగా..." అదేమిటీ మాస్టారు మిమ్మల్ని అన్ని తిట్లు తిడితే మీ అమ్మగారిని కూడా అలా తిట్టేస్తుంటే మీకు కోపం రాలేదా బాధయ్యలేదా" అని అడిగారుట.

దానికి ఆయన "హృదయంలోంచి వచ్చే నిజమైన భావావేశం ఏ వస్త్రం ఏ ఆచ్ఛాదనా లేకుండా చాలా సహజంగా.. నగ్నంగా వుంటుంది. అదే నిజమైన పొగడ్త.. ఆ ఆవేశంలో అక్కడ సంస్కారం ప్రవేశించినప్పుడు అది కొంత కృతకంగా ఆర్టిఫిషియల్‌గా తయారౌతుంది. అతను అసలేమీ ఆలోచించకుండా ఏమీ అనుకోకుండా తన భావావేశాన్ని వ్యక్తం చేశాడు. ఒక కళాకారుడిగా దాన్ని నేను కూడా అర్థం చేసుకోలేకపోతే ఎలా" అన్నారట.

అదీ ఘంటసాల గారి రసవంతమైన మనసు... ఈ మాటలు ఒకసారి ఘంటసాల శ్యామలగారు నాతో చెప్తుంటే నా మనసులో ఘంటసాల గారి మీద గౌరవం ఇంకా ఇంకా ఎంతో పెరిగిపోయింది. ఎదుటివారి ఆవేశాన్ని అర్థం చేసుకుని మాటల్లోని పైపైన వచ్చే అర్థాన్ని పట్టించుకోకుండా, అంతే సహజంగా మనసునులోని భావాన్ని చూడడం, చూడడం అర్థం చేసుకోవడం ఎంత మందికి వీలౌతుంది.!!!! అంత సునిశితంగా ఎదుటివారి మాటల్లో మనసు మాత్రమే చూడడం ఆయనవల్లైంది కనకనే ఆయన, తన పాటల్లో ఆ భావాల్ని అలా అంత గొప్పగా లీనమై పలికించారేమో.!! అందుకే ఆ సంగీత సరస్వతి ఆయనను అలా హత్తుకుని పొదువుకుందేమో...తన ఆ సంగీతాన్ని ఆయనకు ప్రసాదించిందేమో.

– జె.జి.శర్మ



# వీరమల్లు.. మళ్ళీ ఎప్పుడు ?

ముందుగా వార్తల్లో వినిపించినట్లే పవన్ కల్యాణ్ 'హరిహర వీర మల్లు' వాయిదా పడింది. ఇప్పటికే ఈ సినిమా పలుమార్లు వాయిదా పడిన విషయం తెలిసిందే. ఎట్టకేలకు జూన్ 12న విడుదలవుతుందని భావించిన మెగా ఫ్యాన్స్ కి మరోసారి నిరాశ ఎదురైంది. 'హరిహర వీరమల్లు' మరోసారి వాయిదా పడినట్లు టీమ్ తాజాగా ప్రకటించింది. " జూన్ 12వ తేదీకి ఈ చిత్రాన్ని మీ ముందుకు తీసుకురావడానికి అవిశ్రాంత ప్రయత్నాలు చేశాం. ఎంతో శ్రమించినప్పటికీ వివిధ కారణాల వల్ల ఆ రోజు సినిమాని విడుదల చేయలేకపోతున్నాం. ప్రతి ఫ్రేమ్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ, అద్భుతమైన చిత్రంగా మలిచే ప్రయత్నంలో నిమగ్నమై ఉన్నాం. అందుకే మేము మరికొంత సమయం తీసుకుంటున్నాం. మీ ఎదురుచూపులకు బహుమతిగా గొప్ప చిత్రాన్ని అందిస్తామని హామీ ఇస్తున్నాం" అని టీమ్ ప్రకటించింది. ఇదే సమయంలో సోషల్‌మీడియా వేదికగా జరిగే ప్రచారాలను ఏమాత్రం నమ్మవద్దని కోరింది. సినిమాకు సంబంధించిన విషయాలను తామే అధికారికంగా ప్రకటిస్తామని, అంతేకాకుండా త్వరలోనే ట్రైలర్ రిలీజ్ కానుందని.. కొత్త విడుదల తేదీని కూడా ప్రకటిస్తామని టీమ్ వెల్లడించింది. వీరమల్లుని ఏ ముహూర్తాన మొదలుపెట్టారో కానీ ఈ సినిమాని చాలా అడ్డంకులు వచ్చాయి. దర్శకుడు క్రిష్ మధ్యలోనే ప్రాజెక్ట్ నుంచి డ్రాప్ అయ్యారు. తర్వాత చిత్ర నిర్మాత కుమారుడు జ్యోతి కృష్ణ సినిమాని పూర్తి చేశారు. అయితే రిలీజ్ విషయంలో క్లారిటీ రావడం లేదు. పోస్ట్ ప్రొడక్షన్ కు సమయం సరిపోవడం లేదని నిర్మాతలు చెబుతున్నప్పటికీ దేనిపైనా స్పష్టత లేకుండా వుంది.

వాయిదా ప్రకటనలోనే కొత్త డేట్ ఇస్తారేమో అని భావించారంతా. కానీ కొత్త డేట్ లేదు. జూలై 4న ఈ సినిమా వచ్చే అవకాశం వుందని వినిపిస్తుంది. అదే డేట్ కి విజయ్ దేవరకొండ కింగ్ డమ్ వుంది. ఆ సినిమా నిర్మాత నాగవంశీ. హారిక హాసిని, సితార బ్యానర్స్ అంటే త్రివిక్రమ్, పవన్ కళ్యాణ్ హోమ్ బ్యానర్స్ అనే చెప్పాలి. వాళ్ళ స్నేహం గురించి మళ్ళీ ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. జూలై 4కి వీరమల్లు రెడీ అయితే గనుక ఆ డేట్ పవన్ సినిమాకి ఇవ్వడం పెద్ద విషయం కాదు. **– తెలుగు 360.కామ్ సౌజన్యంతో...**

# అఖిల్ పెళ్లి అంత సింపుల్‌గా అందుకేనా?

**సెలబ్రిటీల పెళ్లంటే ఏ రేంజ్ లో జరుగుతుందో చెప్పాల్సిన పనిలేదు. నెల రోజుల ముందు నుంచే హడావుడి మొదలవుతుంది. సోషల్ మీడియాలో వెడ్డింగ్ కార్డులు వైరల్ అవ్వడం.....ఎవరెవర్నీ ఆహ్వా నించారు? ఎంత మంది పెద్ద స్టార్లు హాజరవుతున్నారు? ఏ చిత్ర పరిశ్రమ నుంచి ఏ నటుడు వస్తున్నాడు? ఇలా చాలా హంగామా ఉంటుంది నెట్టింట. పెళ్లి తేదీ దగ్గర పడే కొద్ది ఆ హైప్ ఇంకా పెరుగుతుంది.**



చివరిగా మూడు రోజుల పెళ్లి ఓ రేంజ్‌లో మారు మ్రోగుతుంది. తొలి రోజు హల్దీ, మెహందీ, సంగీత్ వంటి వేడుకలు ఉంటాయి. రెండవ రోజు వివాహం జరుగుతుంది. మూడవ రోజున భారీ ఎత్తున రిసెప్షన్ ఉంటుంది. కానీ అక్కినేని అఖిల్ పెళ్లి విషయంలో ఈ హడావుడి అంతా ఎక్కడా కనిపించలేదు. అసలు అఖిల్ పెళ్లి జరుగుతుంది? అన్న విషయమే బయటకు పొక్కలేదు. అఖిల్ వివాహం ముంబైకి చెందిన జైనబ్ రవ్జీతో ఎంతో నిరాడంబరంగా జరిగిన సంగతి తెలిసిందే.


ఇండస్ట్రీ నుంచి కేవలం కొద్ది మంది అతిథులు మాత్రమే హాజరయ్యారు. అక్కినేని కుటుంబ సభ్యులు ...ఇంకా సన్నిహితులు... స్నేహితులు ఇలా అతి కొద్దిమంది సమక్షంలోనే వేడుక జరిగింది. పలువురు రాజకీయ ప్రముఖుల్ని కూడా ఆహ్వానించారు. అయితే ఆ విషయాలేవి బయటకు రాలేదు. అఖిల్ వివాహాన్ని నాగార్జున చాలా సింపుల్గా తేల్చేసారు. పెద్ద కుమారుడు నాగచైతన్య వివాహం మాత్రం భారీ ఎత్తున జరిగింది. కానీ అఖిల్ విషయంలో మాత్రం నాగ్ ఆ ఛాన్స్ తీసుకోలేదు. ఎంత వీలైంత అంత సింపుల్ గా కానిచ్చే సారు. తాను పెద్ద స్టార్ అని.. వేల కోట్లు ఆస్తులున్నాయనే పరపతిని చూపించుకోలేదు. అఖిల్ –జైనబ్ ఒకర్ని ఒకరు అర్థం చేసుకోవడానికి చాలా సమయం ఇచ్చారు. నిశ్చితార్థం తర్వాత పది నెలల పాటు సమయం ఇచ్చారు. అనంతరమే వివాహ వరకూ వెళ్లారు. అక్కినేని కుటుంబానికి పెళ్లిళ్లు అంతగా కలిసి రాలేదన్నది వాస్తవం. నాగచైతన్య తొలుత సమంతను వివాహం చేసుకోవడం విడిపోవడం తెలిసిందే. అలాగే నాగార్జున మేనల్లుడు, నటుడు సమంత్ కూడా కీర్తి రెడ్డిని వివాహం చేసుకుని విడిపోయారు. రెండవ పెళ్లి చేసుకునే ఆలోచన లేనట్లు వెల్లడించారు. మేన కోడలు సుప్రియ కూడా వివాహానికి దూరంగానే ఉన్నారు. నాగార్జున కూడా అమలను రెండవ వివాహం చేసుకున్నారు. తొలుత నాగార్జున రామానాయుడు కుమార్తెను వివాహం చేసుకున్న సంగతి తెలిసిందే.

**– తుపాకి.కామ్ సౌజన్యంతో..**

## సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

(సత్యంన్యూస్, పాతపట్నం)

నియోజకవర్గ పరిధి హిరమండలం మండలంలో గల గులుమూరు గ్రామానికి చెందిన చెన్నాగి కోటేశ్వరరావు ప్రమాదవశాత్తు మరణించడంతో కుటుంబ సభ్యులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ముఖ్యమంత్రి సహాయనిధికి సిఫార్సు చేయగా మంజూరైన రూ.2లక్షల చెక్కును శనివారం వారి కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేదలకు ఎప్పుడూ అండగా ఉంటుందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు.



## నోటిఫికేషన్‌లో విద్యార్హతలు సడలించండి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఈ నెల 5 న రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్(ఏపీఎస్సీపీసీఆర్) అధ్యక్ష, సభ్యుల ఎంపిక కోసం దరఖాస్తులను ఆహ్వానించిందని, కానీ అందులో పోస్ట్ గ్రాడ్యుయేషన్ విద్యార్హతగా పేర్కొన్నారని, దీనిని సడలించి గత నోటిఫికేషన్ల మాదిరి పాత విద్యార్హతలతోనే నూతనంగా దరఖాస్తులు ఆహ్వానించాలని రాష్ట్ర ప్రభుత్వానికి లేఖలు వ్రాసినట్లు చైల్డ్ రైట్స్ అడ్వోకసీ ఫోరం అధ్యక్షురాలు గొండు ధనలక్ష్మి, ఫోరం న్యాయ సలహాదారు ఏ.ప్రవీణ త్రినాధ్‌లు తెలిపారు. శనివారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ప్రభుత్వానికి వ్రాసిన లేఖా వివరాలు వెల్లడించారు. సిపిసిఆర్ చట్టంలో గానీ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల్లో గాని ఎక్కడా లేని విధంగా ఛైర్పర్సన్/సభ్యుల విద్యార్హతను పి.జి గా నిర్ణయించారన్నారు. అయితే ఈ కమిషన్ లో నియామకాలకు విద్యార్హతలు ప్రామాణికం కాదని, వివిధ రూపాల్లో 10ఏళ్లుగా పిల్లలతో చేసిన సేవలకే తొలత ప్రాధాన్యత అన్న విషయం పైన, గతంలో వివిధ కోర్టులు జారీ చేసిన తీర్పులను పరిశీలించాలన్నారు. సిపిసిఆర్ చట్టాన్ని అనుసరించి, జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్లు గతంలో జారీ చేసిన నోటిఫికేషన్లను పూర్తిస్థాయిలో పరిశీలనలోకి తీసుకొని ఈ విద్యార్హతల్లో మార్పులు, చేర్పులు చేయాలని వారు ప్రభుత్వానికి లేఖలో పేర్కొన్నామన్నారు. తమ ఫోరం విజ్ఞాపనను రాష్ట్ర ప్రభుత్వం పరిశీలించి సత్వర చర్యలు చేపడుతుందన్న ఆశాభావంతో ఉన్నట్టు ధనలక్ష్మి, ప్రవీణ త్రినాథ్‌లు తెలిపారు.

## అబ్బురపరిచిన యోగాంధ్ర



(సత్యంన్యూస్, విశాఖపట్నం)

స్థానిక గాదెరాజు ప్యాలెస్‌లో నిర్వహించిన యోగాసన ప్రదర్శన ఆహుతుల్ని సమ్మోహితులను చేసింది. వయో భేదం లేకుండా ఏడేళ్ల బాలుడు నుంచి 80 ఏళ్ల వృద్ధుల వరకు అలవోకగా చేసిన యోగ విన్యాసాలు అతిథుల్ని కట్టిపడేసాయి. 800 మంది వరకు హాజరైన యోగ సాధకులు తమ ఆరోగ్య రహస్యాల్ని ప్రదర్శన రూపంలో వివరించారు. యోగ సాధకుడు ప్రముఖ గురువు డాక్టర్ చిలక వెంకట రమేష్ నేతృత్వంలో సాగిన ఈ ప్రదర్శనకు నగర వాసుల నుంచి అనూహ్య స్పందన లభించింది. విశాఖ నార్త్ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు సైతం యోగాంధ్రలో పాల్గొని ఆసనాలను వేశారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ మాట్లాడుతూ ప్రధాని మోదీ యోగా విషయంలో అందరికీ ఆదర్శమన్నారు. కార్యక్రమంలో రవీంద్ర, ఓం ఫ్రీ యోగ సంస్థ ప్రెసిడెంట్ కె.శాంతారాం, సిఎంఆర్ సంస్థల ప్రతినిధి మావూరి వెంకటరమణ, ఝాన్సీ, గాదిరాజు వర్మ, ధర్మరాజు, తమేర మల్టీస్పెషల్ స్కిన్‌క్లినిక్ ఆసుపత్రుల నిర్వాహకులు వెంకటరమణ, శాంతి తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

త్యాగ నిరతికి ప్రతీక బక్రీద్ అని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ పేర్కొన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా నగరంలోని జామియా మసీదులో ప్రత్యేక నమాజు శనివారం నిర్వహించారు. ఈ నమాజ్లో జేసీ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం జేసీ మాట్లాడుతూ ఇస్లాం మత ధర్మం ఐదు మౌళిక సూత్రాలపై ఆధారపడి ఉందని, ఇందులో ఏ ఒక్కదానిని విస్మరించినా విశ్వాసం పరిపూర్ణం కాదన్నారు. ముస్లింలు రెండో పెద్దపండగగా జరుపుకొనే బక్రీద్ త్యాగాల సందేశాన్ని తెలియజేస్తుందన్నారు. దేవుడు చూపిన మార్గంలో నడవాలని ఈ పండగ తెలియజేస్తుందన్నారు. కార్యక్రమంలో జామియా మసీద్ ఇమామ్, ప్రభుత్వ ఖాజీ అబ్దుల్ వహాబ్, ఇమామ్ ముఫ్తి మొహమ్మద్. జియావుర్ రెహమాన్ రజ్వి, నగర టిడిపి మైనార్టీ విభాగం అధ్యక్షులు షేక్ నిజాముద్దీన్, ప్రధానమంత్రి 15 సూత్రాల అమలు కమిటీ పూర్వపు సభ్యులు బహదూర్ బాషా, టిడిపి మైనార్టీ నాయకులు రోషన్ భాష, ఎండి రఫీ, ముబారక్, షాను, షఫీ, షేక్ తాజ్ అహమద్, భాషా ఖాన్, ఆర్.టి.ఖాన్‌లు పాల్గొన్నారు.



## ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



భక్తి త్యాగం కరుణకు బక్రీద్ పండుగ ప్రతిరూపమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. బక్రీద్ సంద ర్భంగా ముస్లిం సోదర సోదరీ మణులకు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి వర్యులు. బక్రీద్ త్యాగానికి ప్రతీక అని, త్యాగ గుణాన్ని చాటిచెబుతుందని పేర్కొన్నారు. జీవితంలో ఎదురయ్యే సమస్యలకు వెరవకుండా, దేవుడిపై విశ్వాసాన్ని ఉంచి సన్మార్గంలో జీవనాన్ని సాగించాలనే గొప్ప సందేశాన్ని బక్రీద్ పండగ మానవాళికి ఇస్తోందన్నారు. తమకు కలిగిన దాంట్లో నుంచే ఇతరులకు పంచిపెట్టడాన్ని మించిన దాతృ త్వం మరొకటి లేదనే స్ఫూర్తిని బక్రీద్ పండగ తెలుపుతుందని పేర్కొన్నారు.'ఈద్ ముబారక్' త్యాగ బుద్ధిని, నిజమైన భక్తిప్రపత్తులు కలిగి ఉన్నవారే దైవకృపకు పాత్రులు అవుతారు అనే సూక్తిని బక్రీద్ మనకు తెలియజేస్తుందని పేర్కొన్నారు.

## బస్ స్టేషన్లలో లీజుకు ఖాళీ స్థలాలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రజా రవాణా సంస్థ విజయనగరం జోన్ పరిధిలో గల శ్రీకాకుళం జిల్లాలో వివిధ బస్టేషన్లలో 6 ఖాళీ స్థలాలను 15 ఏళ్లకు లీజుకు ఇచ్చే ప్రాతిపదికన టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు శ్రీకాకుళం జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలో ఇచ్ఛాపురం బిట్-3, 1,113 చదరపు గజాలు, టెక్కలి బిట్-1, 5378 చదరపు గజాలు, బిట్-2, 5378 చదరపు గజాలు, ఆమదాలవలస పాత బస్ స్టేషన్‌లో బిట్-1, 3750 చదరపు గజాలు, బిట్-2, 3750 చదరపు గజాలు, ఎచ్చెర్లలో బిట్-1, 1162 చదరపు గజాల ఖాళీ స్థలాలు లీజుకు ఇస్తామన్నారు. ఈ ఖాళీ స్థలాల వివరాలపై, ఈ నెల 10వ తేదీ ఉదయం గం.11.00లకు శ్రీకాకుళం బస్‌స్టేషన్లో రెండవ అంతస్తులో గల డ్రైవర్ల శిక్షణా కళాశాలలో ప్రీ బిడ్డర్ల సమావేశం నిర్వహించబడును. టెండర్ డాక్యుమెంట్లు, స్థలాల వివరాలు వాటికి సంబంధించిన డ్రాయింగ్ ఆర్టీసీ వెబ్‌సైట్లో పొందుపర్చినట్టు తెలిపారు. బిడ్ సంబంధిత డాక్యుమెంట్లు ఈనెల 17వ తేదీ ఉదయం గం.10.30 ల నుండి మధ్యాహ్నం గం.02.00ల వరకు ఆఫ్ లైన్‌లో సమర్పించవచ్చును. అర్హత కల్గిన బిడ్లు అదే రోజు మధ్యాహ్నం గం.03.00 లకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వారి కార్యాలయం, జోనల్ వర్క్ షాప్, వీటీ అగ్రహారం, విజయనగరం వద్ద ఖరారు చేయబడుతుందన్నారు. ఔత్సాహిక వ్యాపారవేత్తలు టెండరులో పాల్గొని ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు డిప్యూటీ ఈఈ శ్రీకాకుళం వారిని 93460 45369 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

# రాయితీపై విత్తన పంపిణీలో ఎంపీ, మంత్రి



(సత్యంన్యూస్, విజయనగరం)

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సూచనలతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం-వ్యవసాయ శాఖ వారు ఖరీఫ్ 2025 సంవత్సరానికి గాను రైతులకు కేజీకి పది రూపాయలు రాయితీ చొప్పున ప్రభుత్వం నాణ్యమైన వరి విత్తనాలను రైతు సేవా కేంద్రం ద్వారా, అలాగే వ్యవసాయ యంత్రాల పరికరాల బ్యాంకులకు 80శాతం రాయితీపై కిసాన్ డ్రోన్ పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర ఎంఎస్ఎమ్ఈ,సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో కలిసి విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ తాను ఒక రైతు బిడ్డనని, అన్నదాతలు రైతన్నల కష్టాలు తనకు తెలుసునని, ఆ ఇష్టంతోనే 2002లో పొందూరు మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా ఉన్నప్పుడు రైతన్నల గురించి చాలా పాలసీస్ అమలు చేశామని గుర్తు చేసుకుంటూ, ముఖ్యంగా చంద్రబాబు రైతుల పక్షపాతి అని అన్నారు. రైతన్నల గురించి చేస్తున్న చర్యలు హర్షణీయమని, అలాగే రైతులు సులభతర పద్ధతిలో వ్యవసాయం చేసుకునేందుకు వీలుగా మన ప్రభుత్వం ప్రధమంగా ఆధునిక పద్ధతులో వ్యవసాయం చేసేందుకు వీలుగా 80శాతం రాయితీతో రాష్ట్రవ్యాప్తంగా కిసాన్ డ్రోన్లు పంపిణీ చేపట్టడం గర్వించదగ్గ విషయమన్నారు. అలాగే ప్రభుత్వాధికారులు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి రైతన్నలకు తోడ్పాటుగా ఉండి, వారికి ప్రభుత్వం తరపున సకాలంలో నాణ్యమైన విత్తనాలు అదే విధంగా రైతన్నలకు సేవలందించాలని సూచనలు ఇస్తూ, రైతులందరూ ప్రభుత్వం ఇస్తున్న రాయితీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పడాల అరుణ, ఏఎంసీ చైర్మన్ గోపాలరాజు, జిల్లా వ్యవసాయ శాఖ జేడీ తారక రామారావులు పాల్గొన్నారు.

## "అన్న" సేవ ఎంతో సంతృప్తికరం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జేసీఐ శ్రీకాకుళం మెయిన్ ఆధ్వర్యంలో అన్నప్రసాదవితరణ కార్యక్రమం చేపట్టామని జేసీఐ శ్రీకాకుళం మెయిన్ అధ్యక్షులు జేసీ కూన. అనిల్ కుమార్ అన్నారు. నగరంలో ఆహారమందక ఎంతోమంది నిస్సహాయ, నిరుపేదలున్నారని, రాత్రి సమయాలలో వారికి తినటానికి కూడా ఏమి దొరకటంలేదన్నారు. నెలలో కొన్ని రోజులు క్రమం తప్పకుండా అన్నవితరణ కార్యక్రమాలు నిర్వహించాలని, జేసీఐ శ్రీకాకుళం వ్యవస్థాకులు డాక్టర్ జామి భీమశంకర్ పిలుపుమేరకు ఈ రోజు జేసీ పోషక్‌కుమార్ సహకారంతో నగరంలో పలు ముఖ్య కూడలితో పాటు, అరసవల్లి, కొత్తరోడ్, ఆర్టీసీ బస్ స్టాండ్, పాత బస్‌స్టాండ్ ప్రాంగణాలలో అభాగ్య నిరుపేదలకు అన్నవితరణ చేపట్టామన్నారు. జేసీ పోషక్‌కుమార్ మాట్లాడుతూ "అన్న" సేవ ఎంతో సంతృప్తికరంగా ఉందని, పదిమంది కడుపు నింపటం ఆనందంగా ఉందన్నారు. అధ్యక్షులు కూన. అనిల్, కార్యదర్శి తమ్మినేని. ఉష రాణి, బొడిగి మధు, ఇతర సభ్యుల సహకారంతో అన్నవితరణకార్యక్రమం చేయడం సంతోషాన్నిచ్చిందన్నారు. కార్యక్రమంలో జేసీఐ శ్రీకాకుళం మెయిన్ సభ్యులు జేసీ నరేంద్ర, జేసీ ఉర్లం. శివతేజ పట్నాయక్‌లు పాల్గొన్నారు.



## ఆలయ ప్రతిష్టా మహోత్సవంలో ఎమ్మెల్యే

(సత్యంన్యూస్, కొత్తూరు)

కొత్తూరు మండలం మెట్టూరు బిట్-2 గ్రామస్తులు,ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానం మేరకు శ్రీశ్రీశ్రీ ఉమా కాశీ విశ్వేశ్వర ఆలయ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే మామిడి గోవిందరావు రూ.25వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మండల ఎన్డీఏ కూటమి నాయకులు,కార్యకర్తలు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# చిన్నారిని కాపాడిన మెడికవర్ వైద్యులు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)


మెడికవర్ హాస్పిటల్, శ్రీకాకుళంలో వైద్య నిపుణులు చూపిన అవలంబనీయ వైద్య సేవలతో కుపిల్లి గ్రామానికి చెందిన 1 సంవత్సరం 8 నెలల చిన్నారి డి. జష్విత రెడ్డి, తీవ్రమైన మెదడు గాయాలతో ఆసుపత్రిలో చేరిన తర్వాత సురక్షితంగా స్థిరపడింది. ఈమె తల్లి దగ్గరగా ఉన్న ఇంటి రెండో అంతస్తు నుండి ప్రమాదవశాత్తు కింద పడడంతో శరీరానికి తీవ్రమైన గాయాలయ్యాయి. మెడికోవర్‌లో చేరే సమయానికి చిన్నారి పరిస్థితి విషమంగా ఉండగా, ట్రామాటిక్ బ్రెయిన్ ఇంజరీతో పాటు సబ్‌డ్యూరల్ హీమరేజ్, ఎపిడ్యూరల్ హీమరేజ్, సబ్ అరక్నాయిడ్ హీమరేజ్, డిఫ్యూస్ అక్సోనల్ ఇంజరీ వంటి బహుళ మెదడు గాయాలు గుర్తించబడ్డాయి. ఇవన్నీ కలిపి బాలుల్లో ప్రాణాలను ముప్పుపెట్టే స్థాయి ప్రమాదకర గాయాలుగా పరిగణించబడతాయన్నారు. డాక్టర్ సీపాన రాజేష్, డాక్టర్ శ్రీరంగ నేతృత్వంలోని బాల వైద్య న్యూరో క్రిటికల్ కేర్ బృందం తక్షణమే స్పందించి, వెంటిలేటర్‌పై ఉంచి మెదడు పనితీరును గమనించే అధునాతన పద్ధతుల్లో చికిత్స ప్రారంభించారు. "ఇలాంటి గాయాలు చిన్నారుల్లో చాలా సంక్లిష్టమైనవి. మెదడు ఇంకా పెరుగుతున్న దశలో ఉండటం వల్ల, చిన్న పొరపాటు కూడా జీవితాంతం ప్రతికూల ప్రభావాలు చూపవచ్చు. అత్యవసర న్యూరో మద్దతు, నిరంతర పరిశీలన, ఆధునిక బాల వైద్య చికిత్సలతో ఆమెను స్థిరంగా ఉంచగలిగామని డాక్టర్ రాజేష్ తెలిపారు. ఈ ఘటనతో పిల్లల భద్రతపై ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉన్నట్లు స్పష్టమవుతోందన్నారు. బిల్డింగ్‌లు, మెట్ల వద్ద గార్డులు లేకపోవడం, నిబంధనలు పాటించకపోవడం వంటి విషయాలు చిన్నారుల్లో ప్రమాదాలకు దారి తీస్తున్నాయన్నారు. ముఖ్యంగా తలపై బలమైన గాయాలైనపుడు ప్రతి నిమిషం కీలకం అవుతుందన్నారు. శ్రీకాకుళం మెడికవర్ ఆసుపత్రి బాల న్యూరో క్రిటికల్ కేర్ యూనిట్ చక్కటి సేవలతో చిన్నారి ప్రాణాలను రక్షించగలిగిందన్నారు. మా వైద్య బృందం 24 గంటలు అత్యవసర సేవలను అందించడానికి సిద్ధంగా ఉంది. మెడికోవర్ హాస్పిటల్స్ బాధితులకు ప్రేమభరితమైన, నిపుణులతో మెరుగైన వైద్యం అందించడంలో ముందుంటోందన్నారు. శ్రీకాకుళం జిల్లాలోనూ, చుట్టుపక్కల ప్రాంతాల్లోనూ ఉన్న ప్రజలకు అత్యవసర వైద్య సేవలందించడంలో మా కృషి కొనసాగుతుందన్నారు.



శివాలయ నిర్మాణానికి రూ.25వేల విరాళం

(సత్యంన్యూస్, కొత్తూరు)

మండలంలోని మెట్టూరు బిట్-2 పంచాయితీ ఆవరణలో నూతనంగా నిర్మాణం చేస్తూ, ప్రతిష్టా మహోత్సవం చేయనున్న శ్రీ ఉమా కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయ నిర్మాణం కోసం మెట్టూరు బిట్-1 కృష్ణాపురం గ్రామానికి చెందిన ప్రజా నాయకులు బూర్లె శ్రీనివాసరావు బ్రదర్స్ రూ.25వేలు విరాళంగా ఆర్థిక సహాయత అందజేశారు. శనివారం మెట్టూరు గ్రామ సమీపంలో నిర్వహిస్తున్న భక్తితో కూడిన ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఆర్థిక సాయం చేశారు. మెట్టూరు పరిసర ప్రాంతంలో నిర్వాసితులుగా వచ్చిన గ్రామాల్లో ఆర్ అండ్ ఆర్ కాలనీ పాదలి మెట్టూరు బిట్-2 పంచాయతీగా ఎంతో పేరు ప్రతిష్టలు సాధించిన శ్రీ ఉమా కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి భక్తులు కంకణం కట్టారు. ఆలయ నిర్మాణం పూర్తి చేసుకుని ఆలయ ప్రతిష్టా మహోత్సవములు జరుగుచున్న తరుణంలో ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానం మేరకు మండల నాయకులు బూర్లె శ్రీనివాసరావు బ్రదర్స్ ఆలయ కమిటీ సభ్యులకు రూ.25వేలు ఆర్థిక సహాయత అందజేశారు.ఈ సందర్భంగా ఆ ఉమాకాశీ విశ్వేశ్వర స్వామి వారి ఆశీస్సులు బూర్లె శ్రీనివాసరావు బ్రదర్స్ కుటుంబ సభ్యుల పై ఉండాలని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.



'సత్యం'లో ప్రకటనల కొరకు సంప్రదించండి
8019 221 221











# బాబుగారికి అలా కలిసొస్తుంది!

మొదటిపేజీ తరువాయి

ఇంటెలిజెన్స్, జెమిని జిపిటి, గ్రోక్ ఇంకా ఏమైనా ఉంటే అవన్నీ కూడా తన ఆవిష్కరణలేనంటూ ఈ మధ్యకాలంలో చెప్పుకొస్తున్నారు, మనం కూడా చూస్తున్నాం.

అదేదో విదేశాలకు వెళ్లినప్పుడు అక్కడ పెట్టుబడిదారుల గ్రూపు చక్కగా టక్అప్ చేసుకుని, టై కట్టుకుని సూటు వేసుకున్న పారిశ్రామికవేత్తలు అంతా మీ రాష్ట్రంలో పెట్టుబడి పెట్టడానికి మాకు మీరు చూపగలిగిన ఇన్సెంటివ్‌లేంటని అడిగితే.. ఆయన ఇక్కడున్న మౌలిక వసతుల గురించి గానీ, ఖనిజ సంపదల గురించి గానీ, ఓడరేవుల గురించి గానీ, మానవ వనరుల లభ్యతను గురించి గానీ ఒక్క మాట కూడా చెప్పకుండా, అక్కడ చంద్రబాబు అనే బ్రాండ్ ఉందని సగర్వంగా చెప్పేశారు. ఆ పారిశ్రామికవేత్తలంతా తలలు పట్టుకుని అటు నుంచి అటే ఎటో వెళ్లిపోయారు. ఎవరు కూడా ఒక రూపాయి పెడితే ఒట్టు.

ఆ రకమైన నేపథ్యంలో సోనియా కర్కశంగా విడదీసేసిన రాష్ట్రానికి రాజధాని ఎవరు కట్టగలరని జనం అనుకున్నప్పుడు అప్పట్లో హైదరాబాదును కట్టిన మయుడు చంద్రబాబునాయుడేనని నమ్మి ఆయనకు ఓట్లు వేసేశారు. దాంతో ఆయన ఆ పని మీద నియమించిన శివరామ కృష్ణన్ కమిటీ రిపోర్టును చదవకుండానే పక్కన పడేసి అమరావతిని రాజధానిగా ఎంచుకునే 36వేల ఎకరాలు జనం భూమిని తీసుకుని దానికి ప్రభుత్వ భూమి మరి 15 వేల ఎకరాలు జత చేసి మొత్తం 50వేల ఎకరాలకు మించి ఉన్న ప్రాంతంలో రాజధాని కట్టడానికి పూనుకున్నారు. ఇది పచ్చిబూతు పని అని ఆ రోజుల్లో అందరూ ముక్కున వేలేసుకున్నారు. మూడు పంటలు పండే వ్యవసాయ భూమిని అలా బంజరుగా మార్చటం సరికాదని ఎవరు చెప్పినా ఆయన వినే స్థితిలో లేకపోయారు.

విజయవాడ, గుంటూరు, తెనాలి, బందరు చతుర్భుజం ప్రభుత్వ భూములు అన్నింటిలోనూ కావాల్సిన భవనాలు అన్ని కట్టేసి రాజధానికి కావలసిన ఏర్పాట్లు అన్ని చేసుకుంటే.. ఆ చతుర్భుజ ప్రాంతం దానంతట అదే అభివృద్ధి చెందుతుంది. దాంతో చుట్టుపక్కల ఉన్న ప్రాంతాలన్నీ వాటంతట అవే ప్రభావితం అవుతాయి. దానికి కొత్తగా 50వేల ఎకరాలను రాజధాని నిమిత్తం ఒక ప్రభుత్వం తీసుకుని అభివృద్ధి చేయాల్సిన పని లేదని బాధ్యత గల మేధావులంతా అప్పట్లో మొత్తుకున్నారు. కాకపోతే రాజధాని నిర్మాత చంద్రబాబు అనే ఒక కీర్తిని తాను చిరస్థాయిగా దక్కించుకోవాలనే యావ, ఆబ, కండూతి ఏమన్నా కానీ అవే కారణాలతో ఆయన రాజధాని నగరాన్ని నిర్మించడానికి పూనుకున్నారు.

ఇక్కడ ఒక విషయాన్ని గమనించాలి. మహానగరం అనేది ప్రభుత్వం నిర్మించేది కాదు. అది కాలక్రమేణా జనమంతా చేరి అంచెలంచెలుగా కొంచెం కొంచెంగా కాలానుగతంగా నిర్మించుకునే ప్రాంతం. ప్రభుత్వం దగ్గర ఉండే కొద్దిపాటి నిధులు దైనందిన కార్యక్రమాలను దాటి నగర నిర్మాణాలకు సరిపోవు. ఐనప్పటికీ పైన చెప్పిన కీర్తికండూతి కారణంగా చంద్రబాబు మహానగర నిర్మాణానికి పూనుకున్నారు. కట్టేది మనవాడే కదాని తాను ఇచ్చే ఎకరానికి వచ్చే 1200 గజాలు.. గజం ఒక్కంటికి రూ.50వేలు వస్తుందని, ఆ రకంగా తామిచ్చే ఎకరానికి ఎంత లేదన్నా ఆరు కోట్ల రూపాయల సొమ్ము తమకు వస్తుందని దురాశపడి 30 లక్షలు ఖరీదు చేసే తమ పొలాన్ని రాజధాని నిర్మాణానికి ఇచ్చేసి, తిరిగి తామేదో త్యాగం చేసామని వాళ్లంతా అనుకున్నారు.

కట్ చేస్తే.. జగన్ వచ్చారు.. అర్థంలేని మూడు రాజధానుల పల్లవిని ఎత్తుకున్నారు. అమరావతిని ఉన్నచోటనే పడుకోపెట్టేశారు. రాజధాని కాస్తా హుళక్కి అయింది. దాంతో రైతులు ఆందోళన చేశారు. దాంతోపాటు అనేక ఇతర కారణాలతో జగన్ ఆకాశం నుంచి పాతాళానికి పడిపోయారు. మంచిదే. తిరిగి చంద్రబాబు పాలనకు వచ్చారు. ఇప్పుడు మళ్లీ పాత అమరావతిని పట్టాలపైన పెట్టడమే కాకుండా కొత్తగా మరొక 50వేల ఎకరాలు తీసుకుని ఎన్నెన్నో ఇతర కార్యక్రమాలు చేపట్టాలని చూస్తున్నారు. కాకపోతే మన బడ్జెట్, మన తాహతు దానికి సరిపోవు. 13 జిల్లాల చిన్న రాష్ట్రానికి రాత్రికి రాత్రి ప్రపంచ స్థాయి రాజధాని రాదు. ఇది అప్పట్లో కెసిఆర్ యాదగిరిగుట్టను తిరుపతి స్థాయిలో అభివృద్ధి చేస్తానని అన్నప్పుడు సీపీఐ నారాయణ ఏమన్నారంటే తలకిందులుగా తపస్సు చేసినా గుట్ట కొండ కాదు, అమరావతి హైదరాబాద్ కాదు అని కుండ కాదు ఏకంగా ఇత్తడి బిందెనే బద్దలుకొట్టారు.

ఆ దృష్టితో చూసినప్పుడు రెండోసారి పాలనకు వచ్చి ఈ ఏడాది అయ్యాక ముందు భూములు కోల్పోయిన రైతులకు వారి వారి వాటాలను వారికి ఇచ్చే బృహత్కార్యాన్ని గాలికి వదిలేసి 4,500 కోట్లతో సెక్రటేరియట్ భవనం నిర్మాణం అంటూ గాలిమేడలు కట్టడానికి పూనుకున్నారు. ఇంతకంటే ఆత్మహత్య సదృశం మరొకటి ఉండదు. అంతేకాదు మరొక 50వేల ఎకరాలు తీసుకుని అందులో 5వేల ఎకరాల్లో ఎయిర్‌పోర్టును నిర్మిస్తామంటున్నారు. ఇది మరీ అర్థం లేని పని. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ప్రతిరోజు 40వేల మంది ప్రయాణికులు ఉంటారు. ఆ ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి 2008 నాటికి 3వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టారు జీఎంఆర్. ఇప్పటి అంచనాల్లో అది కనీసం 20వేల కోట్ల రూపాయలు అవుతుంది. పట్టుమని రోజుకి వెయ్యి మంది ప్రయాణికులను ఆకర్షించలేని విమానాశ్రయానికి 20 వేల కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టే పారిశ్రామికవేత్త గాని, అతనికి అప్పులు ఇచ్చే ఆర్థిక సంస్థలు గాని భారతదేశంలో లేనేలేవు. ఇప్పుడు ప్రభుత్వం దగ్గర ఉన్న భూములు తాలూకు ప్రభుత్వ వాటాను అమ్మేద్దామనే ఒక దివాలాకోరు ఆలోచనను మంత్రి నారాయణ బయట పెడుతున్నారు. అసలు వాటిని కొనేవాడు ఎవడు? హైదరాబాదు హైటెక్ మోడల్ ఇక్కడ అమలవుతుందనుకుంటే అంతకంటే హాస్యాస్పదమైన ఆలోచన మరొకటి ఉండదు.

మరొక విషయం.. భూమి అనేది పెరుగుదలకు అవకాశం ఉండదు, జనాభా పెరుగుదలతో పాటు భూమి సమాంతరంగా పెరగదు. కాబట్టి భూమి మీద పెట్టుబడి పెడితే అది పదింతలు అవుతుందని చెప్పే శోభన్‌బాబు, మురళీమోహన్ సూత్రీకరణలు అమరావతి విషయంలో పనికిరావు. ఎందుకంటే విస్తారమైన భూములు లభ్యతలో ఉన్నప్పుడు, వాటికి కావాల్సిన డిమాండ్ పాతాళంలో ఉన్నప్పుడు ఒక్కొక్క గజం నేల 50 వేల రూపాయలు పలుకుతుందని పేరాశ కూడనే కూడదు. 50 వేల చదరపు గజముల ఇళ్ల స్థలాలు చేతిలో పెట్టుకుని ఆరేళ్ల నుంచి ఎంత ప్రయత్నం చేసినా కూడా 100 గజాలు విక్రయించలేని దుస్థితిని అందరం చూశాం. సరఫరా కంటే ఒక అంచె డిమాండ్ తక్కువ ఉంటే ఇక సరుకు భూమిపాలే. రాజధాని రైతులు ఈ విషయాన్ని గుర్తెరిగారో లేదో మనకు తెలియదు.

పక్కన గన్నవరంలో ఉన్న ఎయిర్‌పోర్టులో బేరాలు లేక ఖాళీగా ఉంటే, ఇవతల పక్క రాజమండ్రిలో ఎయిర్‌పోర్టు ఉండగా, ఉత్తరాంధ్ర జిల్లాలకు విశాఖతో పాటు భోగాపురం రెడీ అయిపోతుంటే, రేణిగుంట, కడప విమానాశ్రయాలు ఖాళీగా గోళ్లు గిల్లుకుంటుంటే అమరావతిలో 5వేల ఎకరాల్లో 30 వేల కోట్ల రూపాయలతో మరొక ఎయిర్‌పోర్టు నిర్మాణమా? ప్రజల ఆస్తులతో, జీవితాలతో, వారి భవిష్యత్తుతో ఎంత జూదం ఆడతారా? దీన్ని విజన్ అంటారా? హైదరాబాదును ఐదేళ్లలో తానే కట్టానన్న నాయకుడు.. అదే ఐదేళ్లలో అమరావతిలో ఒక్క అడుగు కూడా ముందుకెందుకు వేయలేకపోయాడని ప్రశ్నించుకుంటే మనకు జవాబు తెలుస్తుంది.. అక్కడ కట్టింది ఈయన కాదు, ఇక్కడ కట్టలేకపోయింది ఈయన కాదు అని. ఇలాంటి దుందుడుకు పనులు కేవలం కీర్తి కండూతితో ఎంత మాత్రం చేయతగవు. జనం కూడా ఎంతసేపు కులరొచ్చులో పడి కొట్టుకోవడం కాకుండా నిజమేంటో తెలుసుకునే ప్రయత్నం చేయాలి. లేకుంటే ఆ మూల్యాన్ని వాళ్లే చెల్లించుకోవలసి ఉంటుంది.

# శాలిహుండంలో యోగా వైభవం

## - కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు -



(సత్యంన్యూస్, గార)

ఈ నెల 21న విశాఖపట్నంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ముందు రాష్ట్రవ్యాప్తంగా యోగా ఉత్సవాలు ఊపందుకున్నాయి. శ్రీకాకుళం జిల్లాలో శనివారం గార మండలంలోని చారిత్రక బౌద్ధ క్షేత్రం శాలిహుండంలో యోగాసనాల అభ్యాసన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ ఈ నెల 21న విశాఖలో ప్రధాని సారథ్యంలో 5 లక్షల మందితో భారీ యోగా కార్యక్రమం నిర్వహించనున్నామని, ప్రస్తుతం 150 దేశాల్లో యోగా దినోత్సవాన్ని జరుపుతున్నారని తెలిపారు. ప్రపంచ దేశాలకు యోగా ప్రాముఖ్యాన్ని తెలియజేసిన ఘనత మోదీకే దక్కుతుందన్నారు. యోగాసనాలు వేయటం దినచర్యలో భాగం చేసుకుంటే శారీరక, మానసిక ఆరోగ్యం కలుగుతుందని, శాలిహుండం వంటి రెండవ శతాబ్దం కాలం నాటి బౌద్ధ క్షేత్రంలో ప్రశాంత వాతావరణంలో యోగా చేయడం మంచి అనుభూతినిచ్చిందని పేర్కొన్నారు.

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ గత నెల రోజులుగా జిల్లా వ్యాప్తంగా యోగా కార్యక్రమాలు జరుగుతున్నాయని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయన్నారు. జిల్లాలో నాలుగు చారిత్రక ప్రదేశాలలో యోగ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించాలని తలపెట్టామని, ఇందులో భాగంగా ఇటీవల డచ్ బంగ్లాలో జరిగిన జిల్లా స్థాయి యోగా కార్యక్రమం విజయవంతమైందని, ఇప్పుడు శాలిహుండంలో రెండవ కార్యక్రమాన్ని అదే స్థాయిలో నిర్వహించామన్నారు. త్వరలో కళింగపట్నంలో కూడా ఇంతే వైభవంగా చేస్తామని, ఈ నెల 21న విశాఖలో జరగనున్న ప్రధాని మోదీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో యువత చెడు మార్గాల వైపు ఆకర్షితమవుతున్నారని, అలాంటి పరిస్థితుల్లో యోగా వారిని క్రమశిక్షణతో, ఆరోగ్యపరంగా మంచి మార్గంలో నడిపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ జగదీష్, డాక్టర్ ఉత్తమ్‌రాజ్ రాణా, వివిధ యోగా సంస్థల గురువులు తంగి స్వాతి, కొంక్యాన మురళీ, యోగా గురువు మురళి, గాయత్రి, ఆర్ట్ ఆఫ్ లివింగ్ సురేంద్ర, కల్పన, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, యోగ శిక్షణ కేంద్రాల సభ్యులు, పరిసర ప్రాంత గ్రామాల నుంచి ప్రజలు పాల్గొన్నారు.



# కేంద్ర విమానయాన మంత్రితో జిల్లా మాజీ సైనికుల భేటీ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



కేంద్ర విమాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును ఆయన క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం జిల్లా మాజీ సైనికులు కలిసినట్లు జిల్లా మాజీ సైనికుల అధ్యక్షులు పూర్ణచంద్రరావు కటకం తెలిపారు. భేటీ సమయంలో స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ కూడా ఉన్నారన్నారు. ఇటీవల కాలంలో ఆపరేషన్ సిందూర్ సక్సెస్ అయిన అనంతరం మొదటిసారి కేంద్రమంత్రిని కలవడానికి డిస్ట్రిక్ట్ ఎక్స్ సర్వీస్‌మెన్ ఫెడరేషన్ శ్రీకాకుళం వచ్చిందని, అలాగే మన గురించి బోర్డర్‌లో పోరాడుతున్న సైనికులకు మద్దతుగా జిల్లాలోని మాజీ సైనికులు ఉన్నారని తెలిపారు. మన జాతీయ నాయకత్వం తీసుకునే ఏ నిర్ణయానికైనా బద్ధులమై ఉంటామని, అవసరమైతే మళ్లీ బోర్డర్‌కి వెళ్లి పోరాడడానికి జిల్లా మాజీ సైనికులు సంసిద్ధమని తెలిపారు. అలానే సిక్కోలు ముద్దుబిడ్డ, ప్రస్తుత మేజర్ మళ్లా రాంగోపాల్ నాయుడు కీర్తిచక్ర తీసుకున్న తర్వాత మొదటిసారిగా జిల్లాలో అడుగుపెడుతున్న తరుణంలో డిస్ట్రిక్ట్ ఎక్స్ సర్వీసుమెన్ ఫెడరేషన్ శ్రీకాకుళం తరఫున చిరు సత్కారం చేస్తామని, ఆ కార్యక్రమానికి హాజరు కావాలని కేంద్రమంత్రిని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ సైనికుల సమాఖ్య చైర్మన్ విశ్రాంత గ్రూప్ కెప్టెన్ పి.ఈశ్వరరావు, ప్రెసిడెంటు పూర్ణచంద్రరావు కటకం, హానరరీ ప్రెసిడెంట్ ఎస్.లక్ష్మణరావు, జనరల్ సెక్రటరీ పి.మురళీధరరావు, కోశాధికారి ఎం.సింహాచలం, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు ఎస్.అప్పలసూరి, బి.రాంబాబు, డి.వాసుదేవరావు పాల్గొన్నారు.






# తరలుతున్న ఇసుక రాశులు..

# నేతలకు కాసులు!

(మొదటిపేజీ తరువాయి)

వంశధార నదుల్లో తవ్వకాలు ఆపాలని కలెక్టర్ ఆదేశించారు. అయినా ఎక్కడా ఆగిన దాఖలాలు కనిపించడంలేదు. 13050 మెట్రిక్ టన్నులు అత్యల్పం నుంచి 1,00,485 మెట్రిక్ టన్నుల అత్యధికం వరకు ఇసుకను తవ్వకోడానికి 18 ర్యాంపులకు ప్రభుత్వం అనుమతులిచ్చింది. ఇందులో అంగూరు, గార, ఖాకండ్యాంలలో డీసిల్ట్రేషన్‌లో ఉన్న ఇసుకను మాత్రమే పట్టుకెళ్లాలని సూచించింది. మిగిలినవన్నీ మనుషుల ద్వారా ఇసుకను తవ్వించి ఒడ్డున వేయించే మాన్యువల్ రీచ్‌లు, మరో మూడు సెమీ మెకనైజ్డ్ అంటే కొంత మిషను, కొంత మనుషులు కలిసి చేసే తవ్వకాలన్నమాట. అయితే ఎక్కడా ఈ నిబంధనలు ఫాలో అవ్వరు. అది వేరే విషయం. ప్రొక్లయినర్లు పెట్టి వందలాది లారీలకు డంపింగ్ చేయడమే వీరి పని. ప్రస్తుతం ఉచిత ఇసుక విధానం అవలంభిస్తున్నందున ర్యాంపు ఒడ్డున ఉన్న తెలుగు తమ్ముళ్లు ట్రాక్టర్లతో ఇసుకను తరలించుకొని ఓ చోట డంప్ చేసుకొని లారీలకు ఎత్తి అమ్ముకుంటున్నారు. నదిలో ప్రస్తుతం తవ్వకాలకు అనుమతులు లేవు కదా.. అని ఎవరైనా ప్రశ్నిస్తే ఉచిత ఇసుక కాబట్టి స్థానిక అవసరాల కోసం తమ పార్టీ కార్యకర్తలే తవ్వుకుంటున్నారని, అభ్యంతరాలు చెప్పొద్దంటూ స్వయంగా ఎమ్మెల్యేలే అధికారులకు చెబుతున్నారు. కానీ తమ్ముళ్లు తవ్వింది గోరంతయితే, వారి ముసుగులో పెద్దలు తవ్వుకుపోతున్నది కొండంత. ఉమ్మడి జిల్లాలో కొందరు ఎమ్మెల్యేలకు, జిల్లాలో పెద్దలకు మధ్య ఇసుక విషయంలోనే వివాదాలు కూడా రేగుతున్నాయి. మూలపేట పోర్టు కోసం ఆమధ్య ఒక రీచ్‌ను సంబంధిత కాంట్రాక్ట్ సంస్థ విశ్వసముద్ర దక్కించుకుంది. అయితే ఆ ముసుగులో లెక్కలేనన్ని లారీలను పక్క జిల్లాకు తరలించుకుపోతుందని, తమ నియోజకవర్గంలో ఉన్నవారి నోట్లో మట్టి కొడుతుందంటూ ఒక ఎమ్మెల్యే స్వయంగా ఈ తవ్వకాలను అడ్డుకున్నారు. దీంతో సొంత పార్టీలోనే ఆమధ్య ఇసుక తవ్వకాల మీద పెద్ద దుమారమే రేగింది. అలాగే శ్రీకాకుళం నియోజకవర్గం భైరిలో ఇసుక తవ్వుకుపోతున్న కాంట్రాక్టరు ఇప్పటి వరకు స్థానిక ఎమ్మెల్యేను ఒక్కసారి కూడా కలవలేదని భోగట్టా. ఫోన్ చేసినా తాను మంత్రి వద్దో, మరో పెద్ద నాయకుడి దగ్గరో ఉన్నానని చెబుతున్నారని తెలుస్తుంది. ఈ తవ్వకాల వద్ద తేడాలొస్తుండటం వల్లే మడపాం, గోపాలపెంటలలో ఇంతకు ముందే ఆపరేషన్స్ ఆగిపోయాయి. అలాగే పాలకొండ నియోజకవర్గంలో చినమంగళాపురం, నేరడిలో కూడా నిలిచిపోయాయి. విశ్వసముద్ర పేరు చెప్పి ఉమ్మడి జిల్లాలో దొంపాక, అంధవరం, రోణంకి, భైరితో పాటు అనేక చోట్ల తవ్వకాలు జరిపేస్తున్నారు. ఇంతకీ మూలపేటలో జరుగుతున్న ఇసుక పనులు ఏవీ అంటే ఎవరూ చెప్పలేకపోతున్నారు. ప్రస్తుతానికి నదిలో నీరు రావడం వల్ల దొంపాకలో ఆగినా, మిగిలిన చోట్ల యథేచ్ఛగా తవ్వుకుపోతున్నారు. ప్రస్తుతం సగటు ర్యాంపును ఉదాహరణగా తీసుకుంటే టన్నుకు రూ.200 ప్రభుత్వానికి చెల్లించాలి. అలా సగటు లారీకి 24 మెట్రిక్ టన్నుల ఇసుకను తరలించే అవకాశం ఉంటుంది. ఈ లెక్కన ప్రభుత్వం ఇచ్చిన అనుమతులు నెల రోజులకే పూర్తవుతాయి. కానీ ఇన్నాళ్లుగా ఇసుకను తవ్వుతున్నారంటే ఏమేరకు తప్పుడు బిల్లులు సృష్టిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. గత ప్రభుత్వంలో వైకాపావారే ఇసుక దందాలు నిర్వహించగా.. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో టీడీపీ నేతలు ఆ పాత్రల్లోకి పరకాయ ప్రవేశం చేశారు.

## మేమేం తక్కువ?!

జిల్లా మంత్రి, స్థానిక ఎమ్మెల్యే పేర్లు చెప్పుకొని స్థానిక తెలుగుదేశం నాయకులు రేయింబవళ్లూ ఇసుక దందాల్లో మునిగి తేలుతూ భారీగా అక్రమ సంపాదనకు పాల్పడుతున్నారు. కరజాడ, భైరి రీచుల్లో ట్రాక్టర్ల యజమానులను జట్టుకట్టించిన తెలుగు తమ్ముళ్లు ఇసుక అక్రమాలు కొనసాగిస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుంచే టీడీపీ నాయకులు ఇసుక అనధికార తవ్వకాలు, అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఈ ఆరోపణల గురించి తెలిసి స్థానిక ఎమ్మెల్యే సదరు టీడీపీ నేతలను మందలించినా ఫలితం లేకుండా పోయిందని టీడీపీ కార్యకర్తలే పెదవి విరుస్తున్నారు. నదిలో ఉన్న ఇసుక కంటే.. అక్రమంగా తవ్వి ఒడ్డుకు తరలించి పోగేసిన ఇసుకే భారీ స్థాయిలో ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయంటే.. అక్కడ ఇసుక అక్రమ తవ్వకాలు ఏ స్థాయిలో జరుగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. స్థానిక ఎమ్మెల్యే కూడా మొదట్లో వీరి దందాలను చూసీచూడనట్టు వదిలేసినా.. ఆ తర్వాత స్థానిక టీడీపీ కార్యకర్తల ద్వారా దీన్ని అడ్డుకొనేందుకు ప్రయత్నించారు. ఆ క్రమంలోనే ఆ పార్టీ క్యాడర్ రెండు వర్గాలుగా విడిపోయి పరస్పరం ఫిర్యాదులు చేసుకుంటూ రొడ్డెక్కారు. మరోవైపు భైరి, కరజాడ ర్యాంపుల్లో ఇసుక తవ్వి తీసి, ఆ నిల్వలతో సమీపంలో ఇసుక స్టాక్ పాయింట్ నిర్వహించే బాధ్యతను జిల్లా అధికారులు టెండరు ద్వారా ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించారు. అయినా టీడీపీ నేతలు మాత్రం స్థానిక అవసరాల ముసుగులో ఇసుక తరలింపునకు గ్రామంలో ఉన్న ట్రాక్టర్లకు అవకాశం ఇవ్వాలని ప్రజాప్రతినిధులపై ఒత్తిడి తెచ్చారు. ఆ పేరుతోనే ప్రైవేట్ ఏజెన్సీలకు సమాంతరంగా తవ్వకాలు జరిపిస్తూ సమీపంలోని తోటలు, పొలాలు, రహదారులు, నదీతీరాలు.. ఇలా ఎక్కడ అవకాశం ఉంటే అక్కడికి ట్రాక్టర్లతో ఇసుక డంపింగ్ చేస్తున్నారు. అక్కడి నుంచి విశాఖకు లారీల్లో తరలించి అధిక ధరలకు అమ్ముకుంటున్నారు. దీనికోసం ఒక వ్యక్తితో జేసీబీని కొనిపించారు.

## ప్రభుత్వ ఆదాయం నేతల జేబుల్లోకి

గత ఏడాది వరకు అధికారంలో ఉన్న వైకాపా ప్రభుత్వం ఇసుకను ఆదాయవనరుగా మార్చుకొని ఖజానాను నింపుకుంది. మరోవైపు ఆ పార్టీ నాయకులు ఆదే స్థాయిలో ఇసుక అక్రమ రవాణా చేస్తూ జేబులు నింపుకున్నారు. అప్పట్లో ఇసుక ధరలు కూడా సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయాయి. కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం తీసుకురావడంతో ఇసుక ధరలు తగ్గాయి. అయితే వైకాపా ప్రభుత్వంతో పోల్చుకుంటే ప్రస్తుత ప్రభుత్వానికి ఇసుక ఆదాయం పది శాతం కూడా లేదు. కానీ టీడీపీ నాయకులు మాత్రం జిల్లా వ్యాప్తంగా ఉచిత ఇసుక విధానాన్ని ఆదాయ వనరుగా మార్చుకొని జేబులు నింపుకుంటున్నారు. దీనివల్ల ప్రభుత్వానికి రావాల్సిన కొద్దిపాటి ఆదాయం కూడా రాకుండా పోతోంది.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.